
# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL



సంపుటి :9 | సంచిక - 371 | సోమవారం 02 - మార్చి - 2026 | పేజీలు: 8/ | వెల రూ5/-


## ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మృతి: డొనాల్డ్ ట్రంప్


మరో ఉదయం దినపత్రిక హైద్రాబాద్ :




అమెరికా- ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ మరణించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు.. అమెరికా, ఇజ్రాయెల్ శనివారం దశాబ్దాలలో అత్యంత ప్రతిష్టాత్మకమైన దాడిని ఇరాన్‌పై ప్రారంభించాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ మృతిచెందారని.. ఇరానియన్లు దేశాన్ని స్వాధీనం చేసుకోవడానికి ఇది గొప్ప అవకాశం అని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు ట్రంప్ ట్రూత్‌లో ట్రంప్ పోస్ట్ చేశారు. నేను ప్రజల స్వేచ్ఛను కోరుకుంటున్నా.. నాకు సురక్షితమైన దేశం కావాలి.. అంటూ డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. చరిత్రలో అత్యంత దుర్మార్గులలో ఒకరైన ఖమేనీ చనిపోయాడు.. అంటూ ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు. అయితే.. ట్రంప్ ప్రకటనపై ఇరాన్ స్పందించింది.. ఖమేనీ సురక్షితంగా ఉన్నారంటూ పేర్కొంది.

## ట్రంప్ కనుసన్నల్లో ఆపరేషన్.. ఫోటోలు విడుదల చేసిన వైట్ హౌస్

మరో ఉదయం దినపత్రిక హైదరాబాద్ :



ఇరాన్‌పై అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పర్యవేక్షించారు. సాధారణంగా హైవేల్యూ టార్గెట్లపై జరిగే దాడులే అమెరికా అధ్యక్షుడి కనుసన్నల్లో జరుగుతాయి. తాజాగా ట్రంప్ పర్యవేక్షణకు సంబంధించిన చిత్రాలను శ్వేతసౌధం విడుదల చేసింది. ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లోని ట్రంప్ స్వగృహం మార్ ఎ లాగో రిసార్ట్‌లోని ఆయన రివ్యూ చేస్తుండగా తీసిన ఫొటో ఇది. ట్రంప్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆర్మీ కీలక జనరల్స్ సుసీ విల్లీస్, డాన్ కెయిన్ తదితరులు కూడా అక్కడే ఉన్నారు. మరోవైపు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా వార్ రూమ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న చిత్రాన్ని శ్వేతసౌధం పోస్టు చేసింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు సౌదీ, ఇజ్రాయెల్ సహా ఇతర గల్ఫ్ నేతలతో కూడా టచ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తోపాటే.. ఇజ్రాయెల్ కూడా 'ఆపరేషన్ రోర్ ఆఫ్ ది లయన్' చేపట్టిన విషయం తెలిసిందే.

## ఫ్యాక్టరీలో ఘోర ప్రమాదం.. 17 మంది మృతి

మరో ఉదయం దినపత్రిక హైదరాబాద్



మహారాష్ట్రలో ఘోర ప్రమాదం సంభవించింది. నాగ్‌పూర్ జిల్లాలోని ఓ పేలుడు పదార్థాల తయారీ ఫ్యాక్టరీలో ఆదివారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో కనీసం 17 మంది మృతి చెందారని, పలువురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కటోల్ తహసీల్ పరిధిలోని రౌల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మైనింగ్, పారిశ్రామిక అవసరాల కోసం ఈ కంపెనీ పేలుడు పదార్థాలను తయారు చేస్తుంది. ఉదయం 7 గంటల నుంచి 7:15 గంటల మధ్య ఫ్యాక్టరీలోని డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఈ పేలుడు జరిగినట్లు కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. పేలుడులో గాయపడిన వారిని వెంటనే నాగ్‌పూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, పూర్తి వివరాలతో త్వరలో ఒక ప్రకటన విడుదల చేస్తామని కంపెనీ అధికారి ఒకరు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతుల సంఖ్యపై భిన్నమైన నివేదికలు వస్తుండటంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## వచ్చే నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు ఇస్తాం: పొంగులేటి

మరో ఉదయం దినపత్రిక హైదరాబాద్:

భద్రాద్రి జిల్లా చర్లలో నూతన సర్పంచ్‌ల సన్మాన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు ప్రజా తీర్పు తమ వైపే వచ్చిందని, ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు తమకు మద్దతుగా నిలిచారని తెలిపారు. పాలెంవాగు పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తామని, వచ్చే నెలలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఇరాన్ సుప్రీం లీడర్ మృతి ధ్రువీకరించిన ఇరాన్ మీడియా

మరో ఉదయం దినపత్రిక హైదరాబాద్ :



ఇరాన్‌కు గట్టి దెబ్బ తగిలింది. అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఇరాన్ మీడియా ధ్రువీకరించింది. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో శనివారం ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఖమేనీ కార్యాలయం లక్ష్యంగా జరిగిన భారీ దాడుల్లో ఆయన మరణించారని ఇరాన్ మీడియా పేర్కొంది. దీంతో 40 రోజుల పాటు సంతాప దినాలు పాటించనున్నట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. ఖమేనీ మృతి చెందినట్లు అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన కొద్దిసేపటి తర్వాత ఇరాన్ ఈ మేరకు ధ్రువీకరించింది.

## బీజేపీ పతనం ప్రారంభమైంది : కేజ్రీవాల్

మరో ఉదయం దినపత్రిక న్యూఢిల్లీ :



బీజేపీ పతనం ప్రారంభమైందని ఆప్ అధ్యక్షుడు కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో నిర్దోషిగా విడుదలైన అనంతరం ఆయన ఆదివారం జంతర్ మంతర్‌లో ఏర్పాటు చేసిన మొదటి బహిరంగ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోడీ అవినీతిపరుడు అని, బీజేపీ పతనం ప్రారంభమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మిత్రులారా.. ఇది జంతర్‌మంతర్. ఇక్కడి నుండే ప్రజలు కాంగ్రెస్‌ను తరిమికొట్టారు. జంతర్‌మంతర్‌కి ఈరోజు చారిత్రాత్మక రోజు కానుంది. నేటి తారీఖును గుర్తుంచుకోండి. నేటి నుండే బిజెపి పతనానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది" అని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రధాని మోడీచర్యలు తీసుకోరు. ఎందుకంటే ఆయన వ్యక్తిగతంగా అవినీతిలో పాలుపంచుకుంటున్నారు లేదా ఆయన పార్టీ సభ్యులు లేదా స్నేహితులు భారీ స్కామ్‌లలో భాగస్వాములై ఉన్నారు. నేను అవినీతిపరుడిని కాదు. మోడీ అవినీతి చేస్తున్నారు" అని మండిపడ్డారు.

వివరాలు 2లో

## మోడీ పాలనలో దేశానికి ప్రమాదం

ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

ఈ బాధ్యత కమ్యూనిస్టులదే

కార్పొరేట్ల ప్రయోజనాలకే కేంద్రం పని చేస్తోంది

అమెరికా అధ్యక్షులు ట్రంప్‌తోనూ భారత్‌కు ముప్పు : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు

ఖమ్మం బోసు బొమ్మ సెంటర్‌లో యర్రా శ్రీకాంత్ విగ్రహావిష్కరణ.. బహిరంగ సభ

త్రీ టౌన్‌లో రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు



## వైమానిక దాడిలో సైన్యాధిపతి, రక్షణ మంత్రి మృతి

హైదరాబాద్ : మరో ఉదయం దినపత్రిక



ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ అధ్యక్షుడు మరియు ఖమేనీ ఉన్నత భద్రతా సలహాదారుడు మొహమ్మద్ పాక్‌పౌర్, ఖమేనీ కీలక సలహాదారుడు అలీ షామ్‌ఖానీ కూడా అమెరికా వైమానిక దాడుల్లో మరణించినట్లు ఇరాన్ అధికారిక మీడియా తెలిపింది. గతేడాది జూన్‌లో 12 రోజుల యుద్ధంలో ఇజ్రాయిల్ ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ అధ్యక్షుడిని హత్య చేసిన అనంతరం మేజర్ జనరల్ మొహమ్మద్ ఆ బాధ్యతలు తీసుకున్నట్లు తెలిపింది.

మిగతా 2 లో

## ప్రవాస కేరళీయుల భద్రతపై సీఎం విజయన్ ప్రధానికి లేఖ

మరో ఉదయం దినపత్రిక హైదరాబాద్ :



గల్ఫ్ దేశాల్లోని భారతీయుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కేరళ సీఎం పినరయి విజయన్ ప్రధాని మోడీకి లేఖ రాశారు. పరిస్థితి అవసరమైతే లక్షలాది మంది భారతీయుల భద్రత, సంక్షేమంతో పాటు వారి సురక్షిత తరలింపు కోసం చేయాల్సిన ప్రత్యేక కార్యక్రమాల అవసరాన్ని లేఖలో ఉద్ఘాటించారు. గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న వారిలో అగ్రభాగం కేరళా వాసులే ఉన్న సంగతి తెలిసిందే. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దాడి తర్వాత, గల్ఫ ప్రాంతంలో యుద్ధ నీడలు అలముకుంటున్నాయని, ఈ ప్రాంతంలో పనిచేస్తున్న వారి కుటుంబసభ్యులు, బంధువులు, ఆత్మీయుల భద్రతపై తీవ్ర ఆందోళన చెందుతున్నారని అన్నారు. భద్రతా పరిస్థితి మరింత దిగజారితే, యుద్ధ ప్రాంతాల నుండి భారతీయులను తరలించడానికి కార్యాచరణ ప్రణాళిక అవసరమని పునరుద్ఘాటించారు. విదేశాల్లో పనిచేస్తున్న పౌరులు, వారి బంధువుల గురించి సమాచారం కోసం కేరళ ప్రభుత్వం హెల్ప్‌లైన్‌లను ప్రారంభించిందని లేఖలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) ప్రకారం.. ఉద్రిక్తతలు ప్రారంభమైనప్పటినుండి ప్రవాస కేరళీయుల వ్యవహారాల విభాగం (ఎన్ఒఆర్‌కెఎ) ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌లు 381 కాల్స్‌ను ప్రాసెస్ చేశాయి. ఇప్పటి వరకు, 137మంది ప్రవాసభారతీయులు, గల్ఫ్‌లో పనిచేస్తున్న 244మంది వ్యక్తులు 24 గంటల ఎన్ఒఆర్‌కెఎ హెల్ప్‌డెస్క్ సేవలను వినియోగించుకున్నారు. వీటిలో అత్యధికమైన ఫోన్‌కాల్స్ విమానాల రద్దు, భద్రతా సూచలనకు సంబంధించినవని సిఎంఒ కార్యాలయం తెలిపింది.

# సంపాదకీయం

## విష కౌగిలి!

ఇజ్రాయిల్ పర్యటన ముగించుకున్న మన ప్రధాని దేశానికి చేరుకున్నారు. ఈ పర్యటనలో ఏం తెచ్చారు? వ్యూహాత్మక లాభాలా? దౌత్య వివాదాలా? అన్నది తెలియాలి. గాజా మంటల్లో వేలాది పౌరులు ప్రాణాలు కోల్పోతున్న వేళ ఆ దేశ సందర్శన ఎవరికి ఉపయోగం? ఇప్పుడు చర్చించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ రాజకీయాల్లో దేశాల మధ్య వైరు ధ్యాలు వాటి ప్రయోజనాలకంటే తరచూ ముందుకు రావడం కొత్త విషయం కాదు. కానీ, అవి దేశ ఆర్థిక, దౌత్య, నైతికస్థితిని ప్రభావితం చేసే స్థాయికి చేరితే గనుక ప్రశ్నించడం పౌరుల హక్కు. భారత ప్రధాని ఇజ్రాయిల్ పర్యటన కచ్చితంగా మనకు అలాంటి బాధ్యతను గుర్తుచేస్తుంది. ప్రపంచ పరిణామాలు, సమీకరణలు శరవేగంగా మారుతున్న సమయంలో ఈ పర్యటన అనేక సందేహాలను లేవనెత్తింది. ఓ వైపు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మరోవైపు వెనిజులా అధ్యక్షుడి కిడ్నాప్, ఇంకోవైపు ఇరాన్‌లో యుద్ధ వాతావరణం, అమెరికా టారిఫ్‌ల పెత్తనం- ప్రజలను కలవరపెడుతున్న సమయంలో ప్రధాని ఇజ్రాయిల్ పర్యటన ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. అయితే మోడీ వ్యవ హరించిన తీరు, ప్రసంగం సామ్రాజ్యవాద దేశానికి లొంగుబాటులా కనిపించింది!శాంతి, స్థిరత్వం గురించి ప్రసంగించిన ప్రధాని గాజాలో నలుగు తున్న పాలస్తీనా ప్రజల గురించి ఒక్క మాటైనా మాట్లాడలేదు. శిథిలాల మధ్య విలపిస్తున్న చిన్నారుల కేకలు ఆయన చెవులకు వినిపించలేదా? వేలాది పౌరుల మరణాలు, ఆకలి, నిరాశ్రయత్వం- ఇవన్నీ ప్రపంచదేశాలను కదిలిస్తున్నప్పుడు భారతదేశం మౌనభాషనే ఎం దుకు ఎంచుకుంది? ఒక పక్షానికి మద్దతుగా కనిపించే ఈ సన్నిహితత మన చారిత్రక విలువల్ని, సమానత్వ భావాన్ని, విదేశాంగ విధానాన్ని ఎక్కడికి తీసుకెళ్తోంది? దేశాల మధ్య మిత్రుత్వం కాదనలేం, కానీ మానవత్వం కన్నా మారణ హోమం పైచేయి సాధిస్తుంటే, ఆ మైత్రి దేశ గౌరవానికే ప్రశ్నగా మారదా? ఎనిమిది దశాబ్దాల పాలస్తీనా స్వతంత్ర పోరాటాన్ని, ప్రజల ఆకాంక్షను బాంబుల వర్షంతో, తుపాకీ గొట్టాలతో అణచివేస్తున్న ప్రపంచ నేరస్తుడు నెతన్యాహు. అంతర్జాతీయ న్యాయస్థానమే అతన్ని దోషిగా ప్రకటించింది. అతని విషకౌగిలిలో భారత్‌ను బంధీగా మార్చడం ప్రమా దాన్ని కొనితెచ్చుకున్నట్టే కదా! ఒక జాతి హననం, మానవ హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా సాగుతున్నా ఎన్నడూ దానిగురించి మోడీ ప్రస్తా వించింది లేదు, ఆ చర్యల్ని ఖండిం చనూ లేదు. ఇప్పుడేమో హమాస్‌ను వ్యతిరేకిస్తున్నానని, శాంతి స్థాపనకు ఇజ్రాయిల్‌తో కలిసి పనిచేస్తానని చెప్పడం హాస్యాస్పదం. అసలు నెతన్యాహును కలిసేందుకే చాలామంది దేశాధినేతలు వెనుకంజ వేస్తున్న పరిస్థితి. అతనితో భేటీ అగౌరవానికి సూచికగా భావిస్తున్న వైనం. మోడీ మాత్రం నిస్సిగ్గుగా కలవడం దేనికి సంకేతం. వీరిద్దరి ఆలోచనలు, వ్యూహాలు, అణచివేతలు, సిద్ధాంతాలు ఒకేలా ఉంటాయని ప్రచారం. అక్కడ ఒక జాతిని నిర్మూలిస్తుంటే, ఇక్కడ మత విద్వేషాలు రగిలించడం, ప్రాంతీయ విభేదాలతో అంటకాగడం దేశమంతా చూస్తున్నదే. గుజరాత్ మారణ హోమం దేశ రాజకీయ చరిత్రలో మాయని మచ్చ. అది నేటికీ మానని గాయం. ఆ సిద్ధాంతాన్నే బీజేపీ నమ్ముకుని పనిచేస్తోంది. ఆరెస్సెస్ అధినేత గోల్వాల్కర్ రాసిన పుస్తకంలో కూడా అదే గోచరిస్తుంది. "జాతి మరియు దాని శుద్ధతను కాపాడు కునేందుకు జర్మనీ యూదులను తొలగించింది. దాన్నిచూసి మనజాతి అత్యున్నతస్థాయిలో గర్వపడు తోంది. మూలాల్లోనే భిన్నతలు, అలా ఉన్న జాతులు సంస్కృతులు ఏకీకృతం కావడమనేది అసాధ్యం. ఇది జర్మనీ నిరూపించింది. హిందూస్థాన్‌లో కూడా మనం దీన్నుంచి నేర్చుకోవాలి" అని అందులో పేర్కొన్నారు. జర్మనీ ఊచకోతను సమర్థించడం కోసం, ఇక్కడ మైనార్టీలనూ అదేవిధంగా ఉద్దేశించడం గమనించాలి. జర్మనీలో హిట్లర్ యూదులను బంకర్‌లో పెట్టి చంపేశాడు. దాన్ని ఆదర్శంగా తీసుకోవాలని గోల్వాల్కర్ చెప్పాడు. అదే యూదులకు నాయకునిగా ఉన్న నెతన్యాహుకు మద్దతుగా ఉంటానని చెప్పడం, ఇదే బీజేపీ రాజకీయం! ప్రతీ దేశానికి పరస్పర సహకారం, భద్రత అవసరమే. కానీ, ఆ చర్యలు మానవ హక్కుల ప్రమాణాలు దాటిపోతే ఏంటన్నది ప్రశ్న. పౌరుల ప్రాణనష్టం పెరిగితే అప్పుడు ప్రజాస్వామ్యం తన నైతిక అధికారాన్ని కోల్పోతుంది. మోడీ పాలనలో జరుగుతున్నది అదే! భారతదేశం చారిత్రాత్మకంగా పాలస్తీనా ప్రజల హక్కులకు మద్దతుగా నిలిచింది.అదే సమయంలో ఇజ్రాయిల్‌తో వ్యూహాత్మక సంబంధాలు పెంచుకుంది. ఈ సమతుల్యతే మన విదేశాంగ విధానం.కానీ, ఒక పక్షానికి దగ్గరవడం కోసం, మరోపక్షం బాధను ప్రస్తావించకపోవడం అసమతుల్యతను పెంచు తుంది.

# మోడీ పాలనలో దేశానికి ప్రమాదం

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2**

మోడీ పాలనలో దేశానికి ప్రమాదం ఏర్పడిందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడ్డాయని తెలిపారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ నుంచి ప్రమాదం పొంచి ఉన్నదని చెప్పారు. మహిళలు, దళితులు, మైనార్టీల పరిస్థితి ప్రమాదకర స్థితికి చేరిందన్నారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు ప్రజల మధ్యన పనిచేస్తూ.. ప్రజలను మేల్కొల్పాలని పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజలను అంటిపెట్టుకొని పని చేసే వారే నిజమైన కమ్యూనిస్టులని తెలిపారు. అటువంటి వారిలో ఒకరు యర్రా శ్రీకాంత్ అని అన్నారు. శ్రీకాంత్ స్ఫూర్తితో ప్రజాతంత్ర ఉద్యమాలను నిర్మించాలని సూచించారు. ఖమ్మంలోని బోసుబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన యర్రా శ్రీకాంత్ విగ్రహాన్ని శనివారం బీవీ రాఘవులు ఆవిష్కరించారు. అనంతరం ఖమ్మం నియోజకవర్గ కార్యదర్శి వై.విక్రమ్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం రైతాంగాన్ని కేంద్ర ప్రభుత్వం దివాళా తీయిస్తోందని విమర్శించారు. రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టి.. దిగుమతి సుంకం లేకుండా అమెరికా నుంచి వివిధ పంట ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ ప్రయివేటీకరణలో భాగంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. ఇటువంటి చర్యలను వ్యతిరేకించకపోతే భవిష్యత్తులో కరెంటు కట్ అవుతుందని హెచ్చరించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రద్దును వ్యతిరేకిస్తూ మార్చి 24న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో భారీ బహిరంగ సభ, ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. దేశంలో వైషమ్యాలు సృష్టించే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టులు ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

### దేశానికి ట్రంప్ ప్రమాదం

అమెరికా అధ్యక్షులు ట్రంప్‌తో దేశానికి ప్రమాదం పొంచి ఉందని రాఘవులు హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి దిగుమతి సుంకం లేకుండా పంట ఉత్పత్తులను దేశంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. కోడి కాళ్లు, సోయాబీన్, మొక్కజొన్న, పాల ఉత్పత్తులు, మిర్చి, పసుపు తదితర అమెరికా పంట ఉత్పత్తులను దేశం దిగుమతి చేసుకోవడం ద్వారా పౌల్ట్రీ, డెయిరీ రంగాలు దివాళా తీస్తాయన్నారు. 38 శాతంగా ఉన్న పాడి రైతులతో పాటు కౌలు రైతులు తీవ్రంగా దెబ్బతింటారని హెచ్చరించారు.

### సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే పేదలకు ఇండ్ల పట్టాలు : పోతినేని, నున్నా

సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే ఖమ్మంలోని 6,670 మంది పేదలకు ఇండ్ల పట్టాలు వచ్చాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోరాటంలో శ్రీకాంత్ కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. త్రీ టౌన్ పరిరక్షణ కమిటీకి నేతృత్వం వహించారని, ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం తపించారని అన్నారు. భూదాన్ భూముల్లో పదేండ్లుగా పేదలు ఉంటుంటే ఏమి చేశారని? ఇప్పుడు ఇండ్లను కూల్చడం ఏంటి అని ప్రశ్నించారు. శ్రీకాంత్‌తో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీని కంటికి రెప్పలా కాపాడుకున్న నేత అని కొనియాడారు. బోసు బొమ్మ సెంటర్ భవిష్యత్తులో శ్రీకాంత్ సెంటర్ గానూ మారాలని ఆకాంక్షించారు.

### ఖమ్మం గాంధీ చౌక్ నుంచి 'యర్రా' కవాత్..

శ్రీకాంత్ విగ్రహావిష్కరణ సందర్భంగా ఖమ్మం గాంధీచౌక్ నుంచి బోసు బొమ్మ సెంటర్ వరకు రెడ్ షర్ట్స్, శారీస్ ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మనవళు ప్రదర్శించిన కర్ర సాము ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాసరావు, బండి పద్మ, మాదినేని రమేష్, సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, పి.సోమయ్య, ఎం.సుబ్బారావు, చింతలచెరువు కోటేశ్వరరావు, సత్తుపల్లి, మధిర డివిజన్ కార్యదర్శులు శీలం సత్యనారాయణ రెడ్డి, మడుపల్లి గోపాల్‌రావు, కార్పొరేటర్లు యర్రా గోపి, యల్లంపల్లి వెంకట్రావు, శ్రీకాంత్ సతీమణి యర్రా సుకన్య తదితరులు పాల్గొన్నారు.

### స్ఫూర్తిదాయక నేత శ్రీకాంత్

అసలైన కమ్యూనిస్టులా జీవించిన శ్రీకాంత్ ప్రజల మనస్సులో చిరస్థాయిగా, స్ఫూర్తిదాయకంగా నిలిచారని రాఘవులు అన్నారు. బూర్జువా పార్టీలు రకరకాల రూపాల్లో ప్రజలను ఆకర్షిస్తాయని, కులమత భావాలను రెచ్చగొట్టడమే కాకుండా అవసరమైతే మోడీలా దౌర్జన్యాలకు దిగైనా ప్రజలను తమ మార్గంలోకి తెచ్చుకుంటాయని చెప్పారు. కమ్యూనిస్టులు ప్రజల్లో ఉండి ఇటువంటి వాటిని తిప్పి కొట్టాలని సూచించారు.

## ట్రంప్ బడా(యి) మాటలు!

అతిశయోక్తులు, అబద్దాలకు నిలువెత్తు ప్రతీక డోనాల్డ్ ట్రంప్. అతగాడి మీద వ్యక్తిగత కక్షతోనే, మరో కారణంగానో ఇలా చెప్పటం లేదు. మంగళవారం రాత్రి (మనకు బుధవారం) అమెరికా పార్లమెంటును ఉద్దేశించి నూతన సంవత్సర సందర్భంగా (ఏడాది ప్రారంభంలో మన రాష్ట్రపతి, గవర్నర్లు చేసే మాదిరి) చేసిన ప్రసంగంలో ప్రవచించిన అంశాలు అందుకు ఆస్కారమిచ్చాయి. రెండవసారి అధికారానికి వచ్చిన ట్రంప్ తొలి ఏడాది పాలనాతీరును మూడింట రెండొంతుల మంది ఆమోదించటం లేదని ఒక వైపు సర్వేలు చెబుతుండగా వాటిని పూర్వపక్షం చేస్తూ తన పాలన అదరహో అన్నట్లు ఉందని ట్రంప్ గొప్పలు చెప్పుకున్నాడు. వెనుకటికెవడో ఇంటికి వచ్చిన వారి ముందు తన గొప్ప గురించి చెప్పరా అని సేవకుడికి చెబితె 'మా దొరగారి తోటలో మిరియాలు కొబ్బరికాయల్లా ఉంటాయి దొరా' అన్నాడట. మీరు గనుక జోక్యం చేసుకొని ఉండకపోతే భారత్-పాక్ మధ్య అణుయుద్ధం జరిగి మూడున్నర కోట్ల మంది జనం మరణించి ఉండేవారని పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తనతో అన్నట్లు ట్రంప్ చెప్పుకున్నాడు. తన అవసరం రీత్యా పాక్ నేత నిజంగా అలానే అన్నాడేమో అని ఎవరైనా అనుకోవచ్చుగానీ ట్రంప్ చెప్పటమే విపరీతం.

మరికొన్నింటిని చూస్తేడ అమెరికాలో నేరాల మీద తిరుగులేని విజయం, సరిహద్దుల రక్షణ,గృహనిర్వహణ ఖర్చు తగ్గింపు,ప్రపంచ వేదికలో అమెరికా ప్రతిష్టపెంపుడ.అంతేనా, అంతా మీరే చేశారన్న బొమ్మరిల్లు డైలాగ్ మాదిరి అంతా జోబైడెనే చేశాడంటూ గిడసబారిన ఆర్థిక స్థితిలో సంక్షోభంలో ఉన్న దేశం తనకు వారసత్వంగా వచ్చిందన్నాడు. ఎక్కడ చూసినా నేరాలు, యుద్ధాలు, గందరగోళం ఉన్న స్థితిలో పగ్గాలందుకున్న తాను పరిస్థితిని ఎన్నడూ, ఎవరూ చేయని రీతిలో, గతంలో ఎన్నడూ లేని విధంగా అమెరికాను పెద్దది, మెరుగైన, ధనవంతమైనదిగా మరోసారి మార్చాను అన్నాడు. ప్రపంచ చరిత్రలో గొప్పవాటిగా పరిగణించే మిలిటరీ చర్యలో ఒకటిగా వెనెజులా అధ్యక్షుడిని బందీచేశా. అమెరికాను చూసి ఇప్పుడు విరోధులు భయపడుతున్నారని చెప్పుకున్నాడు. గతంలో వియత్నాం నుంచి పారిపోయిన అమెరికన్లు మరోసారి అఫ్ఘనిస్తాన్‌లో అదే చేశారు. కట్టుబట్టలతో వెళ్లిపోతామంటూ తాలిబాన్‌లతో ప్రాధేయపడి ఒప్పందం చేసుకున్నది ఈ పెద్దమనిషే అన్నది దాస్తే దాగని సత్యం. మరోసారి దాడి చేస్తామని ప్రకటించి యుద్ధనౌకలను మోహరించటాన్ని చూసి నిజంగా భయపడితే రండి తేల్చుకుందాం అని ఇరాన్ అనగలదా? అమెరికాను గొప్పగా చేయటం తరువాత సంగతి, మరోసారి దిగజారుస్తున్నారని అంటున్నట్లు సర్వేలు చెబుతుంటే, ఆర్థిక వ్యవస్థను పటిష్టపరుస్తున్నట్లు నమ్మించేందుకు ట్రంప్ ఈ ప్రసంగంలో పూనుకున్నాడు. తొలి ఏడాది జీడీపీలో 122శాతంతో 38లక్షల కోట్ల డాలర్లకు చేరిన అమెరికా అప్పు ఈ పెద్దమనిషి రెండవసారి పదవీకాలం పూర్తయ్యే నాటికి 2028లో 48లక్షల కోట్లకు చేరనుందని అంచనాలు వెలువడుతుంటే పటిష్టం చేశానని జనం చెవుల్లో పూలు పెడుతున్నాడు. ఆర్థిక వ్యవహారాల నిర్వహణ సరిగా లేదని 57శాతం, పన్నుల విధింపు సమర్థనీయం కాదని 64శాతం మంది జనం అభిప్రాయపడుతున్నట్లు తాజా సర్వేలు వెల్లడించాయి. అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడి పాలనలోనూ జరగని విధంగా ఒక ఏడాది వ్యవధిలో సామాన్య అమెరికన్లు రెండు సార్లు లక్షలాది మంది అతగాడి పాలనా విధానాలకు వ్యతిరేకంగా వీధులకు ఎక్కటాన్ని దాస్తే దాగుతుందా?

## 'సాంకేతిక' సందిగ్ధం!

దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన 'ఇండియా-ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సందర్భంగా అనేక కీలకాంశాలు తెరమీదకు వచ్చాయి. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలే ప్రశ్నార్థకంగా మారాయి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ (ఫౌండేషన్ మోడల్) కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశం చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే నిలబడిపోయాం. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తిస్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాలా మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.అయితే, అన్ని అంశాలకు అమెరికా వైపు చూసే నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవడం అనుమానమే! అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఇప్పటి వరకు అటువంటి ప్రకటన ఏదీ కేంద్ర ప్రభుత్వం నుండి వెలువడకపోవడమే ఈ అనుమానానికి కారణం. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే!

మొదటిపేజీ తరువాయి

## బీజేపీ పతనం ప్రారంభమైంది : కేజ్రీవాల్

తాను పదేళ్లు ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నానని, ప్రధాని మోడీ తనపై ఎన్ని దాడులు చేశారో తనకు తెలియదని, అయితే ఒక్క పైసా అవినీతిని కూడా కనుగొనలేదని అన్నారు. "పదేళు ముఖ్యమంత్రిగా ఉన్న నేను చాలా ఫైళ్లపై సంతకాలు చేశాను. ఢిల్లీ ప్రభుత్వానికి చెందిన ఒక కాంట్రాక్టర్ లేచి నిలబడి కేజ్రీవాల్ నన్ను డబ్బు అడిగారు అని చెప్పినా నేను రాజకీయాలను వదిలేస్తాను" అని అన్నారు. మద్యం పాలసీ కేసులో ఢిల్లీ కోర్టు ఇచ్చి తీర్పుపై ప్రజలను అభినందించాలనుకుంటున్నానని అన్నారు. గత నాలుగేళ్లుగా, మోడీ, అమిత్‌షాలు కుట్రతో ఢిల్లీ ప్రజలను చాలా ఇబ్బంది పెట్టారు. కానీ ఢిల్లీ కోర్టు మోడీజీ మీరు అబద్ధం చెబుతున్నారు. కేజ్రీవాల్ నిజాయితీ పరుడని అన్నారు.

"ప్రజలు మోడీ ప్రభుత్వాన్ని 30 ఏళ్ల తర్వాత పూర్తి మెజారిటీతో ప్రభుత్వంగా చేశారు. నేడు బ్యాంకులు, రైల్వేలు, విద్య, ఆస్పత్రులు, గ్రామాలు, ప్రతిరంగం, అన్నీ 12ఏళ్లలో నాశనమయ్యాయి. నేడు మొత్తం ఉత్తరభారతదేశంలో శ్వాసతీసుకోవడం కూడా కష్టంగా మారుతోంది. వాయుకాలుష్య సమస్యను పరిష్కరించలేకపోయారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మిస్తామని చెబుతున్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం సంగతి సరే .. కనీసం జీవించదగిన భారతదేశాన్ని అయినా తయారుచేయండి" అని మోడీ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.

మొదటిపేజీ తరువాయి

## వైమానిక దాడిలో సైన్యాధిపతి, రక్షణ మంత్రి మృతి

ఇరాన్ సుప్రీం నేత అయాతుల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఇరాన్ పాలన కౌన్సిల్ చేతుల్లోకి వెళ్లింది. ఈ విషయాన్ని ఇరాన్ అధికారిక మీడియా ఐఆర్‌ఎన్‌ఏ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. ముగ్గురు సభ్యులతో కౌన్సిల్‌ను నియమించినట్లు వెల్లడించింది. ఈ కౌన్సిల్‌లో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, న్యాయ వ్యవస్థ అధ్యక్షుడు, గార్డియన్ కౌన్సిల్‌లోని ఒక జ్యూరీ సభ్యుడితో దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ కౌన్సిల్ తాత్కాలికంగా ఇరాన్ పాలనా బాధ్యతలను చూడనుంది. ఇరాన్‌లో సుప్రీం లీడర్ అనంతరం అత్యంత శక్తిమంతమైన విభాగాల్లో గార్డియన్ కౌన్సిల్ కూడా ఒకటి. ఈ కౌన్సిల్‌లో 88 మంది సభ్యులు ఉంటారు. వీరిని అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ అని కూడా పిలుస్తారు. ఆ దేశ చట్టం ప్రకారం ఇరాన్ సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే అధికారం ఈ గార్డ్‌కు ఉంటుంది. ఈ ప్యానల్‌లో ఎనిమిదేళ్ల పదవీకాలం కోసం ఎంపికై వచ్చిన షియా మతగురువులు ఉంటారు. ఈ విభాగమే రాజ్యాంగ పరిరక్షణ బాధ్యతను చూస్తుంది.

## అంబేద్కర్ కాలనీ స్వాగత తోరణం (కమాన్)కు శంకుస్థాపన చేసిన చైర్మన్ కుమార్ గౌడ్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 గుమ్మడిదల న్యూస్**

గుమ్మడిదల మున్సిపాలిటీ 15వ వార్డులోని పొన్నాల శ్రీనివాస్ రెడ్డి ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ కాలనీ స్వాగత తోరణం (కమాన్)కు శంకుస్థాపన చేసిన చైర్మన్ కుమార్ గౌడ్ వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి. ఈ కార్యక్రమంలో సినియర్ నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి గుమ్మడిదల మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్లు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# విజయవంతంగా ముగిసిన మెకానికల్ బాజా సే ఇండియా 2026 ఫైనల్ రేసింగ్ బగ్గీల పోటీలు

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 నర్సాపూర్ న్యూస్**

మెదక్ జిల్లా నర్సాపూర్ లోని బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ), ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగు రోజులుగా జరిగిన "ఈ బాజా సే ఇండియా 2026బగ్గీల పోటీలు" ఆదివారం విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యా అతిధిగా మెదక్ జిల్లా అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ శ్రీ సి.ఎస్. మహేందర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ బాజా సే ఇండియా పోటీలలో పాల్గొంటున్న టీమ్స్ కి అభినందనలు తెలియచేశారు. విద్యార్థులు సంతోషంగా క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని చెప్పారు. అనంతరం పోటీలను పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీ ఆదిత్య విస్సం, జాయింట్ సెక్రటరీ శ్రీ సాయి సుమంత్, పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో ఇటువంటి పోటీలు నిర్వహించడం ప్రథమమని, అటువంటి పోటీలు 2024, 2025, 2026 వరుసగా మూడు సార్లు నిర్వహించబడిన ఘనత తమ ఇంజనీరింగ్ కాలేజీకి చెందుతుందని చెప్పారు. పోటీలలో పాల్గొంటున్న విద్యార్థులకు అల్ ది బెస్ట్ చెప్పటం జరిగింది. బహుమతుల ప్రధాన కార్యక్రమంలో ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, మాట్లాడుతూ తమ కళాశాలలో జాతీయ స్థాయి పోటీలు బాజా పోటీలు నిర్వహించటం ఇది మొదొవసారి అని మా శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చెర్మన్ శ్రీ కె వి విష్ణురాజు దూరదృష్టి కోర్ ఇంజనీరింగ్ యొక్క ప్రాధాన్యతను తెలిపేందుకు ఉద్యోగ అవకాశాలు విద్యార్థులకు పుష్కలంగా వచ్చేందుకు నిరంతరం పరితపిస్తారని, వారి ఆలోచన రూపమే నేటి ఈ భారీ ఖర్చుతో కూడిన పోటీలు నిర్వహిస్తున్నామని తెలియచేశా రూ. ఈ కార్యక్రమానికి అతిధిగా శ్రీ మహేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్, ఒలెక్ట్రా , పాల్గొన్నారు,.డాక్టర్ జి నాగరాజన్, ప్రెసిడెంట్ సే ఇండియా, శ్రీ షుహే కోయెన్, బి 2 బి అమ్మకాలు మరియు మార్కెటింగ్ సలహాదారుడు హెచ్ఐపిపి, మరియు విశిష్ట అతిధిగా శ్రీ శ్రవణ్ కుమార్, టెరిటరీ మేనేజర్ రిటైల్, భారత్ పెట్రోలియం పాల్గొన్నారు వారు మాట్లాడుతూ అన్ని టీమ్స్ కు అభినందనలు చెప్పారు ఈ పోటీలకు పైన చెప్పిన వారి సహాయం, తోడ్పాటు మరువలేమని వారి సహాయంతో ఈ కార్యక్రమాన్ని చాల చక్కగా నిర్వహించామని ముఖ్యంగా బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి చాలా అద్భుతమైన సహాయం తోడ్పాటు అందించిందని శ్రీ బాలరాజ్ సుబ్రమణియన్, బాజా సే ఇండియా చైర్మన్ ఆర్గనైజింగ్ కమిటీ, డాక్టర్ కె.సి.వోరా, బాజా సే ఇండియా సలహాదారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియపరిచారు. ఎం బాజా సే ఇండియా కన్వీనర్ శ్రీ అలీ సయ్యద్, జాయింట్ కన్వీనర్ డాక్టర్ వేముల మురళికృష్ణ, ప్రొఫెసర్ అఫ్ మెకానికల్ ఇంజనీరింగ్ బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నర్సాపూర్ వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా 11 రాష్టాల నుండి 1500 వందల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారని తెలియపరిచారు. మొత్తం 51 బగ్గీలు రెజిస్టర్ చేసుకోగా చివరి పోటీ సమయానికి 32 బగ్గీలు మాత్రమే అర్హత సాధించాయని తెలియపరిచారు. మహారాష్ట్ర నుండి 13 టీమ్స్, తమిళనాడు నుండి 9 టీమ్స్, ఆంధ్రప్రదేశ్ నుండి 4 టీమ్స్, కర్ణాటక నుండి 4 టీమ్స్, కేరళ నుండి 4 టీమ్స్, తెలంగాణ నుండి 4 టీమ్స్, ఝార్ఖండ్ నుండి 2 టీమ్స్, మధ్యప్రదేశ్ నుండి 2 టీమ్స్, ఢిల్లీ, హరియాణా, పంజాబ్ నుండి ఒక్కొక్క టీమ్స్ పాల్గొన్నాయని తెలియపరిచారు.

**ఈ ఉత్కంఠ పోటీలలో విజేతలు:**

01. మొదటి బహుమతి : డాక్టర్ విశ్వనాథ్ కరద్ వీ౫ వరల్డ్ పీస్ యూనివర్శిటీ, పూణె, బహుమతి నగదు రూ.150000/- 02. రెండవ బహుమతి: ఖాజు సాంకేతిక విశ్వవిద్యాలయం, కర్ణాటక, బహుమతి నగదు రూ.100000/- 03. మూడవ బహుమతి: డివై పాటిల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కొల్హాపూర్, , బహుమతి నగదు రూ.75000/- 04. వాహన స్థిరత్వానికి రెండవ బహుమతి ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలోని శ్రీ విష్ణు ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్‌కు దక్కింది. బహుమతి నగదు రూ.20,000/ 05. వాహన తయారీ ఎక్సలెన్స్ అవార్డు మొదటి బహుమతి ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలోని శ్రీ విష్ణు ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్‌కు దక్కింది. బహుమతి నగదు రూ.40,000/ 06.వెహికల్ కంప్యూటర్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ అవార్డు మొదటి బహుమతి ఆంధ్రప్రదేశ్‌లోని భీమవరంలోని శ్రీ విష్ణు ఇంజనీరింగ్ ఫర్ ఉమెన్‌కు దక్కింది. బహుమతి నగదు రూ.30,000 07. బి వి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి డాక్టర్ ముత్తు లాగు బాజా సే ఇండియా 2026 ద్రోణాచార్య అవార్డు గ్రహీత గా










ఎంపికయ్యారు శ్రీ మనోనీత్ సింగ్ , అడ్వైసర్ అఫ్ విష్ణు మోటార్ స్పోర్ట్స్, శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ డ్ స్టాటిక్ అండ్ డైనమిక్ ఈవెంట్ కోఆర్డినేటర్స్ డాక్టర్ కె రాయుడు, డాక్టర్ జష్ట్ర.మధుబాబు, డాక్టర్ డి వి రాజు మెకానికల్ ప్రొఫెసర్ అఫ్ ది ఈవెంట్ ఆర్గనైజర్, డాక్టర్ వరుణ్ హెడ్ మెకానికల్ ఇంజనీరింగ్ అఫ్ బివిఆర్ఐటి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో బివి రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దూబే, డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి ప్రసాద్, బాలాజ్ సుబ్రమణ్యం, చెర్మన్, ఆర్గనైజింగ్ కమిటీ, డాక్టర్ కె.సి.వోరా, బాజా సే ఇండియా సలహాదారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. యంబాజా సే ఇండియా పోటీలు సజావుగా సాగేందుకు బివి రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం మరియు మేనేజర్, బి బాపిరాజు , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టిఎల్ఎన్ సురేష్ వారు నిరంతరం కృషి వలన ఈ ప్రోగ్రాం విజయవంతమైనది అని అన్నారు.

**దోమల సమస్యపై**

# బీజేపీ ప్రజా నిరసన దీక్ష

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నిజాంపేట సర్కిల్ బాచుపల్లి రాజీవ్ గాంధీ నగర్లో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలు ఎదుర్కొంటున్న దోమల సమస్యపై నిరసన దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు కాసాని సంతోష్ గజ్జెల్లి సంతోష్ బాచుపల్లి బీజేపీ అధ్యక్షులు ఎన్ ప్రసాద్ రాజు ఆధ్వర్యంలో దోమల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దోమల నివారణపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలో విఫలమైందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు త్రీవ నిరసన వ్యక్తం చేశారు. నిరసన దీక్షలో పాల్గొన్న ముఖ్య అధితి బీజేపీ రాష్ట ఉప అధ్యక్షురాలు కొల్లి మాధవి మాట్లాడుతూ ఈ దోమల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఈ దీక్షతో అయిన మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దళిత మోర్చా నాయకులు దాసి నాగరాజు జిల్లా నాయకులు చెన్న రెడ్డి,రచ్చ చక్రధర్,ప్రొఫెసర్ చంద్ర మౌళి,జక్కుల రవి,పద్మ ప్రసాద్,నిజాంపేట పార్టీ అధ్యక్షులు భిక్షపతి యాదవ్,ప్రగతి నగర్ అధ్యక్షులు నరేంద్ర చౌదరి,మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బ రావు,దళిత మోర్చా నర్సింగ్ రావు,ప్రధాన కార్యదర్శి నారాయణ మూర్తి,సురేష్ గోపతి,అమర్,ప్రహ్లాద్,భార్గవి రెడ్డి,అశోక్ నాయక్,రాపన్ కాశీ,బీజేవైఎం నాయకులు అతీష్ బాబు,శరత్ చౌదరి,సాయి కృష్ణ రెడ్డి,కార్తీక్,నర్సింహా రెడ్డి, కిషోర్,మండల యువమోర్చా అధ్యక్షులు భూపాల్ రెడ్డి,స్రవంత్ కుమార్,చరణ్,సురేష్,రవి తదితరులు దీక్షలో పాల్గొన్నారు.





# బీఆర్ఎస్ యువనేత మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా ముగిసిన కెసిఆర్ క్రికెట్ ట్రోఫీ పోటీలు

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 అమీన్‌పూర్ న్యూస్**

అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని ఐలాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ యువనేత మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ ట్రోఫీ పోటీలు ఘనవిజయంగా ముగిశాయి. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 59 జట్లు పాల్గొని ఉత్సాహంగా పోటీ పడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో ఐలాపూర్ వారియర్స్ జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచింది. పాండు 11 జట్టు రన్నరప్‌గా నిలిచింది. మ్యాచ్ అత్యంత రసవత్తరంగా సాగి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ , పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. యువత క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలని వారు సూచించారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన మాణిక్ యాదవ్‌ను స్థానిక నాయకులు, క్రీడాభిమానులు అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి , జగదీశ్వర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జగనాథ్ రెడ్డి , , యువనేతలు మెరాజ్ ఖాన్ , శ్రీనివాస్ యాదవ్ , శివ, శ్రీకాంత్ , బీఆర్ఎస్ నాయకులు వెంకట్ రెడ్డి , నరేష్ తదితరులు పాల్గొన్నారు.





# ఎర్రవెల్లిలో కేసీఆర్‌ను కలిసిన మామిళ్ళ రాజేందర్

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 సంగారెడ్డి న్యూస్**

మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ను ఆదివారం ఎర్రవెల్లి నివాసంలో టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ మాజీ అధ్యక్షుడు మామిళ్ళ రాజేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన మామిళ్ళ రాజేందర్, కేసీఆర్ ఆశీర్వాదం తీసుకున్నారు. వివాహం విజయవంతంగా, శుభముగా జరగాలని కేసీఆర్ ఆకాంక్షించారు.



# శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం లో పాల్గొన్న పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 పటాన్‌చెరు న్యూస్**

పటాన్‌చెరు నియోజకవర్గం ముత్తంగి డివిజన్ ఘనాపూర్ గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మారాంబ అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహణ. పటాన్‌చెరు నియోజకవర్గం ముత్తంగి డివిజన్ పరిధిలోని ఘనాపూర్ గ్రామంలో ఘనాపూర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మారాంబ అమ్మవార్ల కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి , పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ ,బి.ఆర్.ఎస్ నాయకులు శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు. వారు ప్రత్యేక పూజల్లో పాల్గొని దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అలాగే ఘనాపూర్ మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి , మాజీ సర్పంచ్ కాశీ రెడ్డి , బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు కృష్ణ కాంత్ , రాఘవేంద్ర గౌడ్ , దేవరాజ్ గౌడ్ మరియు ఇతర నాయకులు, గ్రామ పెద్దలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఘనాపూర్ ఉత్సవ కమిటీ సభ్యులను అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.



# రైల్వే అండర్ బ్రిడ్జి ను పరిశీలించిన ఎంపీ రఘనందరావు

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 రామచంద్రపురం న్యూస్**


ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు, BHEL MIG సొసైటీ నుండి తెల్లాపూర్ సాయిబాబా ఆలయం తెల్లాపూర్ కు వెళ్లే మార్గంలో ఉన్న ప్రస్తుత RUB (Railway Under Bridge) ట్రాఫిక్ అవసరాలను తీర్చలేకపోవడంతో, రైల్వే అధికారులతో చర్చించి కొత్త =ఖదీను అధికారికంగా మంజూరు చేయించామని తెలిపిన మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు. ఈ కొత్త RUB నిర్మాణానికి అవసరమైన రోడ్డు విస్తరణ కోసం ఈరోజు స్థానికులతో మాట్లాడి వారిని ఒప్పించినట్లు తెలిపిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు. అదేవిధంగా, తెల్లాపూర్ MIG qT+&□ RR`7 ప్రాంతానికి ఎలాంటి రోడ్డు కనెక్టివిటీ లేనందున ఒక కొత్త రైల్వే ఫుట్ బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని, అలాగే ప్రస్తుతం తెల్లాపూర్ వరకు ఆగుతున్న రైళ్లను ఈదులనాగులాపల్లి వరకు విస్తరించే అంశంపై దక్షిణ మధ్య రైల్వే జీఎమ్‌తో అధికారిక సమావేశం ఏర్పాటు చేసి చర్చించనున్నట్లు వెల్లడించారు. అలాగే చీఎ పటాన్‌చెరు ICRISAT వద్ద ఉన్న చీఎ-65 నుండి ప్రారంభమై RR`7 వరకు, ESI హాస్పిటల్ ముందు నుంచి అన్నమయ్య కాలనీ పక్కనుండి తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం వరకు కొత్త రోడ్డు నిర్మాణంపై GHMC, BHEL అధికారులతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. త్వరలోనే ఆ రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయడానికి కృషి చేస్తామని తెలిపిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు.

# మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

## - ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 పటాన్ చెరు న్యూస్**

ఘనపూర్ మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్.మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని ఘనపూర్ లో ఆదివారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణం, జాతర మహోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కాశి రెడ్డి, రాజ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు,



# శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ నిర్మాణం కొరకు భూమి పూజలో పాల్గోన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 పటాన్ చెరు న్యూస్**

పటాన్ చెరు నియోజకవర్గం ముత్తంగి డివిజన్ పోచారం పరిధిలోని మహిధర లగ్జూరియా కాలనీలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి.నూతన దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి అతి త్వరలో నిధులు కేటాయిస్తామని తెలిపారు. హాజరైన సీనియర్ నాయకులు తలారి బిక్షపతి, కోడూరి బిక్షపతి, కాలనీ అధ్యక్షులు స్వాతి, వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# కంచర్ల గూడెంలో అంగరంగ వైభవంగా మల్లన్న జాతర

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 పటాన్ చెరు న్యూస్**

గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే జాతరలు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం భానూరు పరిధిలోని కంచర్ల గూడెంలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి.. చిత్తారమ్మ కళ్యాణ మహోత్సవం జాతర కార్యక్రమానికి ఎమ్మెల్యే జి ఎం ఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సి ఐ విజయ్ కృష్ణ, గ్రామ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





# మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 కొండాపూర్ న్యూస్**

కొండాపూర్ మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామంలో మాజీ సర్పంచ్ అంకుశ ఇంద్రారెడ్డి తండ్రి సిరిపురం లక్ష్మారెడ్డి మృతి చెందడం పట్ల సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఇంద్రారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్ష్మారెడ్డి మరణం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఇంద్రారెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని సూచించారు. ఇలాంటి క్లిష్ట సమయంలో పార్టీ ఎల్లప్పుడూ కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు విట్టల్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వహీద్, సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ పాండు రంగారెడ్డి, నాయకులు సంతోష్ రెడ్డి, సుధీర్ రెడ్డి, రాములు, సంగమేశ్వర్ గౌడ్, లక్ష్మీకాంత్, అజీమ్ తదితరులు ఉన్నారు.



# ఘనపూర్ గ్రామంలో ఘనంగా మల్లన్న స్వామి జాతర

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 పటాన్ చెరు న్యూస్**

ముత్తంగి డివిజన్ పరిధిలోని ఘనపూర్ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి జాతర మహోత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ ఉత్సవంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు సుధా ని ఘనంగా సన్మానించారు.




# వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 సదాశివపేట న్యూస్**

చందాపూర్ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన టీజీ ఐఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి.ఇందిరా మహిళా శక్తి భవనం, సిసి రోడ్లు, స్కూలుకు ప్రహరీ , కల్వేట్, ఉచిత మినరల్ వాటర్.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చాట సిద్దన్న, గ్రామ సర్పంచ్ పట్లోళ్ల మల్లేశం, ఉప సర్పంచ్ ,వార్డ్ మెంబర్లు, మాజీ సర్పంచ్ రాములు, జయం, యాదయ్య, నాగరాజు, పెద్ద మల్లేశం, మరియు మిగతా గ్రామస్తులు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్ , సర్పంచులు శివానంద్ గౌడ్, బలరాం శ్రీనివాస్, దుర్గాప్రసాద్, బింబాదర్ చారి, గంగన్న, బసవరాజ్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, మిగతా మండల నాయకులు పాల్గొన్నారు.




# మనుధర్మాన్ని తిరస్కరించాలి

**మరో ఉదయం దినపత్రిక**

వికలాంగుల హక్కులను ఒప్పుకోని మనుధర్మశాస్త్రాన్ని తిరస్కరించాలని, ప్రజాస్వామ్య స్ఫూర్తికి భిన్నంగా కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్నదని ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సంఘం 16వ ఆవిర్భావ వారోత్సవాల ముగింపు సభను శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్ అధ్యక్షతన 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ వికలాంగులపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్రజల ఓట్లను తొలగించేందుకే 'సర్' అమలు చేస్తున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ అమలవుతోందని, ఇప్పటివరకు 10.70 కోట్ల ఓట్లు తొలగించారని తెలిపారు.

# ఇస్నాపూర్ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 పటాన్ చెరు న్యూస్**

ఇస్నాపూర్ మున్సిపాలిటీలో జరిగిన ఎన్నికల్లో అనుకూల ఫలితం రాలేని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను తెలంగాణ రాష్ట్ర మాజీ ఎస్సి ఎస్టి కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి , పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ మరియు ఇతర బీఆర్ఎస్ ముఖ్య నాయకులు కలిసి పరామర్శించారు.ఈ సందర్భంగా వారు అభ్యర్థులకు మనోధైర్యం నింపుతూ, పార్టీ కోసం వారు చేసిన శ్రమను అభినందించారు. ఎన్నికల్లో గెలుపుఓటములు సహజమని పేర్కొంటూ, నిరుత్సాహపడకుండా మరింత ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. భవిష్యత్తులో పార్టీని బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని, ప్రజల విశ్వాసాన్ని మరింతగా పొందాలని నాయకులు పిలుపునిచ్చారు



# పట్కర్ సమాజ్ ఆధ్వర్యంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ కౌన్సిలర్ లకు సన్మానం

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 సంగారెడ్డి న్యూస్**

నూతనంగా ఎన్నికైన సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ , వైస్ చైర్మన్ లతో పాటు పలువురు కౌన్సిలర్ లను పట్కర్ సమాజ్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపం లోని ఎస్ఎస్ కే భవన్ లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, వైస్ చైర్మన్ షఫీ హఫీజ్ లతో పాటు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లు తోపాజీ వీణా హరీష్, శ్రీకాంత్ గౌడ్, సంగీతా మహేష్ ల ను పట్కర్ సమాజ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్, పట్కర్ సమాజ్ అధ్యక్షుడు కోనేరీ చందర్, మాజీ ప్రధాన కార్యదర్శి చవాన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఈదుల నాగులపల్లి గ్రామంలో మల్లన్న జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**మరో ఉదయం దినపత్రిక మార్చ్ 2 పటాన్ చెరు న్యూస్**

సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన మల్లన్న జాతరలో పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్లన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. హాజరైన సీనియర్ నాయకులు రమేష్, శ్రీశైలం, రాజ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు




# నేను మాట నిలబెట్టుకున్నా కాంగ్రెస్ ను నిలదీయండి

- ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులేవి?
- హామీలిచ్చి మోసం చేయడంలో కేసీఆర్ ను మించిపోయిన రేవంత్ రెడ్డి
- గ్రామాలకు పైసలివ్వని కాంగ్రెస్ గాంధీ గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడం సిగ్గు చేటు
- పంచాయతీ ఎన్నికలైన వెంటనే కేంద్రం గ్రామాలకు నిధులు మంజూరు చేసింది
- గ్రామాల అభివృద్ధి పనులకు నయాపైసా ఇయ్యని రాష్ట్ర ప్రభుత్వం
- వీళ్లా గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడేది
- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్...
- గన్నేరువరంలో ఏకగ్రీవమైన పీచుపల్లి గ్రామానికి రూ.10 లక్షల ప్రోత్సహకం అందజేసిన కేంద్ర మంత్రి

**కరీంనగర్ బ్యూరోమరో ఉదయం దినపత్రిక**

బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునే గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సహకాన్ని అందజేస్తానంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నేడు నిలబెట్టుకున్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో బీజేపీ అభ్యర్థులను సర్పంచులుగా ఎన్నుకున్న గన్నేరువరం మండలంలోని పీచుపల్లి, కోహెడ మండంలోని విజయనగర్ కాలనీ గ్రామ పంచాయతీలకు తన ఎంపీ లాడ్స్ నిధుల నుండి రూ.10 లక్షల చొప్పున ప్రోత్సహక నిధులు విడుదల చేశారు. ఈరోజు ఆయా గ్రామ పంచాయతీలకు విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రామస్థుల సమక్షంలో ఆయా నిధుల సర్క్యులర్ కాపీలను గ్రామ సర్పంచులకు అందజేశారు. ఈ సందర్భంగా విజయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి సంజయ్ మాట్లాడుతూ "భవిష్యత్తులో గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తా. అభివృద్ధి చేస్తా. అయినా కొందరు బండి సంజయ్ ఏం తెచ్చారంటూ విమర్శలు చేస్తున్నారు. వాటిని నేను పట్టించుకోను. ఎందుకంటే నా లక్ష్యం గ్రామాలను అభివృద్ధి చేయడమే. ఎందుకంటే గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం. వీటితోపాటు ప్రజల కోసం అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తా."అని పునరుద్ఘాటించారు. అనంతరం పీచుపల్లికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ సామ రాజిరెడ్డి, బీజేపీ స్థానిక నేతలకు తన ఎంపీ లాడ్స్ నుండి రూ.10 లక్షల ప్రోత్సాహక నిధుల సర్క్యులర్ కాపీని అందజేయడంతోపాటు మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. "బీజేపీ బలపర్చిన సర్పంచు అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకునే గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల ప్రోత్సహకాన్ని అందజేస్తానని గత పంచాయతీ ఎన్నికల్లో ఇచ్చిన మాటను నేను నిలబెట్టుకున్నా. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఏకగ్రీవంగా ఎన్నికైన పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తానని ప్రకటించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 1203 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఒక్కో పంచాయతీకి 10 లక్షల చొప్పున మొత్తం 120 కోట్ల 30 లక్షల రూపాయలు ఇవ్వాలి. కానీ ఇంతవరకు నయాపైసా ఇయ్యలే."అని ఆ





ప్రకటనలో పేర్కొన్నారు. "హామీలిచ్చి మోసం చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ సర్కార్ ను మించిపోయారు. కేసీఆర్ సైతం ఆనాడు ఏకగ్రీవమైన గ్రామ పంచాయతీకి 5 నుండి 10 లక్షలదాకా ప్రోత్సాహక నగదు అందిస్తామని హామీ ఇస్తే... దాదాపు 2 వేలకుపైగటా గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు లేకుండా ఏకగ్రీవమయ్యాయి. కానీ చిల్లిగవ్వ ఇయ్యలే. ఈ రెండు పార్టీలు దొందూ దొందే. ప్రోత్సాహక నిధులు ఎందుకు ఇవ్వడం లేదనే అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలను కోరుతున్నా."అని పిలుపునిచ్చారు."రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల అభివృద్ధికి చిల్లిగవ్వ ఇవ్వడంలేదు. మాజీ సర్పంచులు చేసిన పనులకు బిల్లులివ్వాలని తిరిగి తిరిగి ఆత్మహత్యలు చేసుకున్నా గత ప్రభుత్వం పట్టించుకోలే. ఈ ప్రభుత్వం అదే బాటలో నడుస్తోంది. బీజేపీ పోరాటాలకు, మాజీ సర్పంచుల ఆందోళనలకు తలొగ్గి వాయిదాల పద్దతిలో పైసలిచ్చేందుకు ముందుకొచ్చింది. మాజీ సర్పంచుల బిల్లులు సరే... గ్రామ పంచాయతీల అభివృద్ధికి పైసలేవి? కేంద్రం ఇప్పటి వరకు పంచాయతీల అభివృద్ధి కోసం దశల వారీగా దాదాపు వెయ్యి కోట్లకుపైగా నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో అంతో ఇంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదు. వీళ్లా గ్రామ స్వరాజ్యం....గాంధీ ఆశయాల గురించి మాట్లాడేది?"అని ఆ ప్రకటనలో విమర్శించారు.

# జిల్లా అవోపా ఆధ్వర్యంలో విహారయాత్ర

**కరీంనగర్ మరో ఉదయం దినపత్రిక**

కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసో సియేషన్ అధ్యక్షుడు కొమురవెల్లి వెంకటేశం ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ వైశ్యభవన్ నుండి బస్సులో మొదట కమాన్ పూర్ లోని శ్రీ ఆది వరహా స్వామి ఆలయం, సుద్దుల్ల లోని శ్రీ లక్ష్మి నర్సింహ స్వామి ఆలయం, మందమర్రి లోని కామాఖ్య ఆలయం లను దర్శించుకొని ఆవోప కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపి తిరిగి కరీంనగర్ చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అవోపా ఉపాధ్యక్షులు సామ నారాయణ, పీవీ రామక్రిష్ణ, కట్కురి సుధాకర్,కొత్త ప్రకాశ్, వి రవీందర్, కొండూరి అజయ్ చక్రవర్తి,ఎల్ చంద్రశేఖర్, పబ్బ అరుణ , శ్రీదేవి ప్రొగ్రాం ఇంచార్జి నాగమల్ల మునీందర్, తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా ఏబిసి కిడ్స్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

**కరీంనగర్ మరో ఉదయం దినపత్రిక**

ఏబీసీ కిడ్స్ ప్లే స్కూల్ వార్షిక దినోత్సవ వేడుకలు కరీంనగర్ అల్కాపూర్ లోని శ్రద్ధ ఇన్ బాంకెట్ హాల్‌లో ఘనంగా జరిగాయి. చిన్నారుల ఆటపాటలతో, సాంస్కృతిక ప్రదర్శనలు,కరాటే ప్రదర్శనలు, స్కిట్‌లు, ఫ్యాన్సీ డ్రెస్ వాకింగ్ వినోదాత్మక ప్రదర్శనలతో సహా వివిధ రకాల రంగురంగుల కళ సాంస్కృతిక కార్యక్రమాలతో వార్షికోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగాయి. వేద పండితులు చిన్న జీయర్ స్వామి శిష్యులతో ,విశిష్ట అతిథుల సాంప్రదాయ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ లుపడిశెట్టి వసంతలక్ష్మి బూమయ్య ,మాసం గణేష్ , వెల్ది సర్పంచ్ పెంచాల కిషన్ రావు (మానకొండూర్ మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు), డాక్టర్లు మనీష్ , ఎజ్జగిరి శ్రీనివాస్ , రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, సదా చారి (ఎండి, సుమన్ టీవీ కరీంనగర్), సామాజిక కార్యకర్త రాము డంపేటి ప్రత్యేక విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. కరస్పాండెంట్ మనోజ్ కుమార్ వేడుకలో అతిథులందరినీ ఘనంగా సన్మానించి జ్ఞాపకాలను అందజేశారు.





# శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం


**వరంగల్, మార్చి1,మరో ఉదయం దినపత్రిక ,**

వరంగల్ లోని కొత్త వాడ శ్రీ చైతన్య పాఠశాల లో భారతరత్న సివి రామన్ జయంతి సందర్భంగా శనివారం జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు పాఠశాల ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు వారి వారి ఇంటి దగ్గర వివిధ రకాల తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ పాఠశాల ఆవరణలో ప్రదర్శించారు విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ను వరంగల్ ట్రాఫిక్ సీఐ సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ హారిక జ్యోతి ని వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ ప్రదర్శనను విద్యార్థుల తల్లిదండ్రులు సందర్శించి తయారు చేసిన విధానం మనకు ఉపయోగపడే విధానం గురించి అడిగి తెలుసు కున్నారు విద్యార్థులు తాము తయారుచేసిన ఎగ్జిబిట్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐ సుజాత మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చిన్నతనం నుండి సైన్స్ పట్ల మంచి అవగాహన ఆలోచన విధానాన్ని పెంపొందించుకోవాలని బాల్యం నుండే దేశానికి సమాజానికి ఉపయోగపడే యంత్రాలు తయారుచేసి శాస్త్రవేత్తగా ఎదగాలని సూచించారు ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించారు ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం చేతన్ వరంగల్ ట్రాఫిక్ ఎస్ఐ రామా రావు, డీన్ రాజు , ఆర్ ఐ మనోహర్, ప్రైమరీ ఇంచార్జ్ జయశ్రీ కోఆర్డినేటర్స్ అలేఖ్య తిరుమల్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.













# మాదిగ అమరవీరులకు ఘన నివాళి!!

**మాదిగ అమరవీరుల త్యాగ ఫలితమే ఎస్సీ వర్గీకరణ అమలు!!..**

**ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ!!**

**మరో ఉదయం దినపత్రిక వనపర్తి జిల్లా ప్రతినిధి**



ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ దగ్గర ఎస్సి రిజర్వేషన్ల వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో తమ విలువైన ప్రాణాలను అర్పించిన మాదిగ అమరవీరుల సంస్కరణ దినోత్సవం ప్రతి సంవత్సరము మార్చి 1న తెలుగు రాష్ట్రాల్లో నిర్వహిస్తారు ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్కరణ దినోత్సవం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎం ఈ ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్న కేశవులు మాదిగ గార్లు పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో మాదిగలు 30 సంవత్సరాల తర్వాత వర్గీకరణ సాధించుకున్నా ఈ సాధనలో మాదిగ అమరవీరుల పాత్ర చాలా కీలకమైనదని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గంధం గట్టయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ సమన్వయకర్త,రాజారాం ప్రకాష్ మాదిగ ప్రజా వాగ్గాయకారుడు, మాట్లాడుతూ మాదిగ అమరవీరుల ఆశయ సాధన కోసం ముందుకు సాగుతామని తెలిపారు అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకులంతా అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.. ఈ కార్యక్రమంలో మొలకలపల్లి పరుషరాముడు మాదిగ ఎం ఎస్ ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు, ఎం డి ఖాదర్ పాష, టీజేఎస్ జిల్లా అధ్యక్షులు,విశ్వం బాబు, ఎస్సీ ఎస్టీ మానిటర్ విజిలెన్స్ సభ్యులు, జె కురుమూర్తి ఎం ఈ ఎఫ్ నాయకులు, కొమ్ము చెన్నయ్య మాదిగ, కేశవులు మాదిగ, గట్టుస్వామి మాదిగ ఎం ఎస్ పి జిల్లా కో కన్వీనర్, సిరీన్ మాదిగ ఎం ఈ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ,గంధం నాగరాజు మాదిగ సామాజిక కార్యకర్త , వంగలి నాగరాజు మాదిగ ,జిటి శ్యామ్ , ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ గద్వాల ఆంజనేయులు , గొర్ల శైలాన్ కుమార్, పెరుమాళ్ళ నాగరాజు మాదిగ,గోపాల్ మాదిగ, నాగన్న మాదిగ, కొమ్ము వెంకటేష్ మాదిగ అడ్వకేట్, రమేష్ ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు , ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# నూతన దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం

**మహిధర లగ్జూరియా కాలనీ లో సమస్యల పరిష్కారానికి కృషి**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు / మరో ఉదయం దినపత్రిక :**

నూతన కాలనీలలో దేవాలయాల నిర్మాణాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.ఆదివారం ముత్తంగి డివిజన్ పోచారం పరిధిలోని మహిధర లగ్జూరియా కాలనీలో శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణ పనుల కోసం ఏర్పాటు చేసిన భూమి పూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దేవాలయం నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారానికి అతి త్వరలో నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలారి బిక్షపతి, కోడూరి బిక్షపతి, కాలనీ అధ్యక్షులు స్వాతి, వైస్ ప్రెసిడెంట్ సురేంద్ర, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసమే పేదల ఇళ్ల కూల్చివేత

**రేవంత్ సర్కార్‌ది ప్రజా ప్రభుత్వం కాదు..**
**ప్రజా వ్యతిరేక ప్రభుత్వం.**
**ఖమ్మంలో గడ్డపార రాజ్యం..**
**అర్ధరాత్రి పూట అమానుషంగా పేదల గెంటివేత!**
**కోర్టు ఆదేశాలు బేఖాతరు.. 4000 మంది పోలీసులతో పేదల గుడిసెలపై దౌర్జన్యం.**
**మీడియా సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ధ్వజం.**

ఖమ్మం, బ్యూరో మరో ఉదయం దినపత్రిక మార్చి 1.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాల కోసమే రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల ఇళ్లను దౌర్జన్యంగా కూల్చివేసిందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నారపురాజు రామచంద్రరావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా వెలుగుమట్ల ప్రాంతంలో ఆశ్రయం కోల్పోయిన భూదాన బాధితులను ఆయన పరామర్శించారు. న్యాయస్థానం ఆదేశాలను ఖాతరు చేయకుండా తెల్లవారుజామున భారీ బలగాలతో చిన్నారులు, వృద్ధులు అని చూడకుండా పేదలను వీధిన పడేయడం దారుణమని మండిపడ్డారు. బాధితులందరికీ అక్కడే నివాస స్థలాలు కేటాయించి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులు తమ గోడును రామచంద్రరావు ముందు వెళ్లబోసుకున్నారు. గత వారం రోజుల నుంచి ఖమ్మంలో భూదాన యజ్ఞ సంస్థ నిర్వాసితుల ఆక్రందన యావత్తు తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా ప్రతిధ్వనిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల ప్రాంతంలోని భూ కొలత సంఖ్య నూట నలభై ఏడు, నూట నలభై ఎనిమిది, నూట నలభై తొమ్మిది భూముల్లో గత పదిహేను సంవత్సరాలుగా దాదాపు ఆరు వందల పేద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పద్దెనిమిది వందల మందికి పైగా నిరుపేదలు కూలి పనులు చేసుకుంటూ పైసా పైసా కూడబెట్టుకుని వంద గజాల చొప్పున స్థలాన్ని ఏర్పాటు చేసుకుని చిన్నపాటి గుడిసెలు నిర్మించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కనీస కనికరం లేకుండా ఆ ఇళ్లను నేలమట్టం చేసిందని రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నత న్యాయస్థానం యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆ ఆదేశాలను ఏమాత్రం ఖాతరు చేయలేదని ఆరోపించారు. ఆ పత్రాలు అసలైనవి కావని కుంటి సాకులు చెబుతూ పేదల ఇళ్లపై భారీ యంత్రాలను ప్రయోగించారని మండిపడ్డారు.

అనంతరం ఖమ్మం నగరంలోని అంబేద్కర్ భవనంలో తలదాచుకున్న బాధిత కుటుంబాలను భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పరామర్శించారు. ఈ కష్టకాలంలో వారికి భారతీయ జనతా పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పక్కనే జాతీయ రహదారి రావడం వల్ల భూమి విలువ పెరిగిందని, అధికార వర్గాలకు అత్యంత సన్నిహితులైన స్థిరాస్తి వ్యాపారులకు ఆ భూములను కట్టబెట్టేందుకే దాడులు చేశారని విమర్శించారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో నాలుగు వేల మంది భద్రతా బలగాలతో దౌర్జన్యంగా నిరుపేదల గూడు చెదరగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గర్భిణీలు, వృద్ధులు, పసిపిల్లలు, రోగులు అని కూడా చూడకుండా, ఉజ్వల భవిష్యత్తు కోసం పుస్తకాలు చదువుకుంటున్న విద్యార్థులను సైతం అమానుషంగా లాగి బయటపడేశారని ధ్వజమెత్తారు. పేదలు తమ రెక్కల కష్టంతో కొనుగోలు చేసుకున్న నిత్యావసర వస్తువులు, బియ్యం బస్తాలు, కాయగూరలు, పప్పు దినుసులు, పిల్లల చదువుల పుస్తకాలు అన్నీ శిథిలాల కింద కలిసిపోయాయని విచారం వ్యక్తం చేశారు. కనీసం ఆ వస్తువులను బయటకు తీసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా వ్యవహరించడం శోచనీయమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతిలో గునపం పట్టుకుని ఏ ఇల్లు కనిపిస్తే ఆ ఇల్లు కూలగొడుతున్నారని రామచంద్రరావు దుయ్యబట్టారు. ఇది ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం ఏమాత్రం కాదని, పూర్తిగా ప్రజా వ్యతిరేక ప్రభుత్వమని ధ్వజమెత్తారు. భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ అణగారిన వర్గాల పక్షాన నిలబడుతుందని ఉద్ఘాటించారు. బాధితులకు అదే స్థలంలో వంద గజాల చొప్పున స్థలాలు ఇచ్చి, ప్రభుత్వమే తన సొంత ఖర్చులతో వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధితులకు సంపూర్ణ న్యాయం జరిగే వరకు పోరాటం నిరంతరం కొనసాగుతుందని, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. భవిష్యత్తులో స్థానిక ప్రజలతో కలిసి భారీ ఎత్తున ఉద్యమిస్తామని పాలకులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు , భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, జిల్లా ఇంచార్జ్ బద్ద మహిపాల్ రెడ్డి, నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి, ఉప్పర్ల శారద, గల్లా సత్యనారాయణ , శీలం పాపారావు, దొంగల సత్యనారాయణ, మందడపు సుబ్బారావు, గుత్తా వెంకటేశ్వర్లు, వీరవల్లి రాజేష్, బండారు నరేష్, నున్న రవికుమార్, విజయరాజు, దొడ్డ అరుణ, రజినీ రెడ్డి, కుమిలి శ్రీనివాస్, రవి రాథోడ్, శ్యామ్ రాథోడ్, ఏలూరి నాగేశ్వరరావు, నీరుకొండ ఉషారాణి, పమ్మి అనిత కందుల శ్రీకృష్ణ, మందా సరస్వతి, రామనేని మనీ , నకిరేకంటి వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క మరియు యం. ఎల్. ఏ పాయం వెంకటేశ్వర్లు

మరో ఉదయం దినపత్రిక మార్చి 01, పినపాక ప్రతినిధి.

స్థలం: మల్లూరు గ్రామం ములుగు జిల్లా, మంగపేట మండలం, మల్లూరు గ్రామంలోని పవిత్ర శ్రీ హేమాచల లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా పాల్గొనిస్వామివారినిదర్శించుకున్నారు. అర్చనలు నిర్వహించి నియోజకవర్గ ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి కోసం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీ పోరిక బలరాం నాయక్ హాజరయ్యారు. భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగింది.





## సింగరేణిలో తండ్రి కొడుకుల ఉద్యోగాల స్ఫూర్తిదాత యూనియన్ కొమరయ్య ఆయన పేరు వింటే తిరుగుబాటు బావుట !!

మరో ఉదయం దినపత్రిక మార్చి 01, పినపాక ప్రతినిధి.

కార్మికులహృదయాలలో ఎదురులేని కార్మిక నేత సుమారు 50 సంవత్సరాల పాటు సింగరేణి కార్మికులను కంటికి రెప్పలాగా కాపాడుకున్న గొప్ప కార్మిక నేత నేటి నాయకులకు ఆయనఆదర్శం నీతికి నిజాయితీకి నాటి బొగ్గు గాని కార్మిక నేతల్లో యూనియన్ కొమరయ్య గొప్ప నేతగా కార్మికుల పక్షపాతిగా ఎన్నో త్యాగాలు ఎన్నో పోరాటాలు మరెన్నో జైలు జీవితాలు అన్ని కలగలిపి తెలంగాణ బొగ్గు గని కార్మిక హృదయాలలో గొప్ప నేతగా నిలిచారు సింగరేణిలో డిపెండింగ్ ఎంప్లాయిమెంట్, తండ్రి కొడుకుల ఉద్యోగాన్ని తీసుకువచ్చి నిరుద్యోగ సమస్యకు కొత్త రూపాన్ని ధార్మికను చేకూర్చిన నాయకుడు యూనియన్ కొమరయ్య తాను తీసుకొచ్చిన తండ్రి కొడుకుల ఉద్యోగం స్థానంలో కాలక్రమేపి కారుణ్య నియామకాలుగా మారి నేడు రెండు సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు లేక సింగరేణిలు అవస్థలు పడుతుంటే కొమరయ్య ఆత్మ గోశిస్తుంది, మారు పేర్లు మారక తల్లడిల్లుతున్న సింగరేణి భూమి పుత్రుల గోస గుర్తింపు ప్రాతినిత్య సంఘాలకు పట్టదాయే !!! మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి కారుణ్య నియామకాలను చేపట్టాలి...






## సింగరేణి మరియు ఇసుక రవాణా కారణంగా మణుగూరు - బయ్యారం రహదారిపై దుమ్ము, ధూళి పెరిగి ప్రజలు పడుతున్న ఇబ్బందులపై

**మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు**

(మరో ఉదయం దినపత్రిక ) మార్చి 01,పినపాక ప్రతినిధి.

ప్రభుత్వ వైఫల్యం, ఇసుక లారీల అడ్డూఅదుపు లేని ప్రయాణాల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా, ప్రభుత్వం మరియు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల ఆరోగ్యం విపరీతమైన ధూళి కారణంగా వాహనదారులు, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారని, ఇది ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి నిర్వహణ మరియు రోడ్ల మరమ్మతులు పట్టించుకోకుండా కేవలం ఇసుక అక్రమ రవాణా మరియు లాభాల మీదనే ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఆయన ఆరోపించారు. ఈ సమస్యపై తక్షణమే చర్యలు చేపట్టాలని, ప్రమాదాల నివారణకు రవాణా నియంత్రణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో, బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## చౌదరి గూడలో ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణం

**పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

శంషాబాద్. మార్చ్ 1. మరో ఉదయం దినపత్రిక


శంషాబాద్ మండలంలోని చౌదరిగుడా గ్రామంలో శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి కళ్యాణ వేడుకల్లో ప్రకాష్ గౌడ్ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నర్ఖూడ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు గణేష్ గుప్తా. కొడిగంటి చంద్రారెడ్డి. నీరటి రాజు ముదిరాజ్. పెద్ద షాపూర్ సర్పంచ్ దేవులపల్లి సత్యనారాయణ గౌడ్. పారేపల్లి శ్రీనివాస్ గౌడ్. చిలుకమర్రి మహేందర్ ముదిరాజ్. దవణాకర్ గౌడ. బిజెపి నాయకులు నాన్న వాళ్ళ. కుమార్ యాదవ్. మేండే కుమార్ యదవ్ , బుర్కుట బాస్కర్ స్థానిక నాయకులు హీరేకార్ శివాజీ. జిల్లా శ్రీనివాస్ ముదిరాజ్. బుద్ధం కృష్ణ యాదవ్. గ్రామస్థులు పాల్గొన్నారు.





## మంత్రి తుమ్మల దార్శనికత ఫలించిన సందర్భం

**ఆయిల్ ఫామ్ రైతులకు మహర్దశ**
**టన్ను గెలలు ధర 21,546**
**15,024 మంది రైతులకు 2 కోట్ల అదనపు ఆదాయం**
**రేవంత్ సర్కార్ కొలువు తీరాక 1,07,400 ఎకరాల్లో 33,500 మంది రైతులు పామాయిల్ సాగు**
**ఈ ఏడాది ఆయిల్ ఫామ్ సాగుకు 456 కోట్ల కేటాయింపు**



ఖమ్మం బ్యూరో మరో ఉదయం దినపత్రిక మార్చి 01

.మంత్రి తుమ్మల పై హర్షం వ్యక్తం చేస్తున్న ఆయిల్ ఫామ్ రైతులు.నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణకు బాటలు వేసిన మార్గదర్శి.లక్షలాది రైతుల కుటుంబాల తలరాత మారేలా ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ.పది లక్షల ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ లక్ష్యం

## నూతన వధూవరులను సతి సమేతంగా ఆశీర్వధించిన భూక్యా సురేష్ నాయక్

ఖమ్మం బ్యూరో మరో ఉదయం దినపత్రిక మార్చి 01

ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండా కి చెందిన బానోత్ సత్యనారాయణ & ప్రమీల దంపతుల కుమారుడు పృథ్విరాజ్ & దివ్య ల వివాహ రిసెప్షన్ కే బి అర్ నగర్ లోని వంశీ కృష్ణ ఫంక్షన్ హాల్ నందు పాల్గొని నూతన వధూవరులు ఇద్దరినీ ఆశీర్వదించి నిండు నూరేళ్లు అష్టైశ్వర్య ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుని ప్రార్థించిన ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్యా సురేష్ నాయక్ దంపతులు .



# అణు పరీక్షల ధీశాలి వాజ్‌పేయి

## ఖమ్మం సభలో వెంకయ్య నాయుడు సంచలన వ్యాఖ్యలు

కులం కంటే గుణమే మిన్న.. విలువల్లేని రాజకీయాలపై మాజీ ఉపరాష్ట్రపతి ఆవేదన

అమ్మను పరభాషలో పిలిస్తే శవంతో సమానం.. మాతృభాష ప్రాధాన్యతపై ఉద్ఘాటన

తక్షణ ఆహారంతో నిరంతర రోగాలు.. పాశ్చాత్య సంస్కృతిపై యువతకు దిశానిర్దేశం

క్రమశిక్షణే అత్యున్నత పదవులకు సోపానం.. తన రాజకీయ ప్రస్థానాన్ని నెమరువేసుకున్న వెంకయ్య నాయుడు.

**ఖమ్మం, బ్యూరో మరో ఉదయం దినపత్రిక మార్చి 1.**









మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి కేవలం ఒక రాజకీయ నాయకుడు మాత్రమే కాదని అద్భుతమైన వక్త, రచయిత, కవి, ప్రజాస్వామ్యవాది, గొప్ప దేశభక్తుడు అని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కొనియాడారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన వాజ్‌పేయి శతజయంతి పుస్తకావిష్కరణ సభలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవుల కోసం పీఠాల కోసం వాజ్‌పేయి ఎప్పుడూ రాజీపడలేదని, ఓటమిని సైతం అత్యంత హుందాగా స్వీకరించిన గొప్ప వ్యక్తిత్వం ఆయన సొంతం అని స్పష్టం చేశారు. స్వచ్ఛమైన మనసుతో దేశ సేవ చేయాలని ఆకాంక్షించిన గొప్ప నాయకుడు ఆయన అని ప్రశంసించారు. వాజ్‌పేయి హయాంలోనే దేశవ్యాప్తంగా స్వర్ణ చతుర్భుజి రహదారుల నిర్మాణం, గ్రామీణ రహదారుల అనుసంధానం, సమాచార ప్రసార రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. ప్రపంచ దేశాల ఆంక్షలను ఏమాత్రం లెక్కచేయకుండా రాజీలేని ధోరణితో పోఖ్రాన్ అణు పరీక్షలు నిర్వహించిన ధీశాలి వాజ్‌పేయి అని ఉద్ఘాటించారు. దేశంలో ఒకే విధానం ఉండాలనే శ్యామప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా కాశ్మీర్‌లో కల్పిస్తున్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం ఒక గొప్ప చారిత్రక ఘట్టం అని అభివర్ణించారు. వాజ్‌పేయి పాలనా దక్షత, నిస్వార్థ సేవ నేటి తరానికి ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. గతంలో జనసంఘ్, కమ్యూనిస్ట్, కాంగ్రెస్, స్వతంత్ర పార్టీ వంటి రాజకీయ పక్షాలకు ఒక నిర్దిష్టమైన సిద్ధాంతం ఉండేదని, నేటి రాజకీయాల్లో ఆ సిద్ధాంతాలు పూర్తిగా లోపించాయని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కేవలం అవకాశవాదంతో పక్షాలు మారుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కులము కన్నా గుణము మిన్న అని స్పష్టం చేస్తూ రాజకీయాల్లో కులం, ధనం, మతం, నేరచరిత్ర ఆధారంగా కాకుండా నాయకుడి వ్యక్తిత్వం, సామర్థ్యం, యోగ్యత, ప్రవర్తన చూసి ప్రజలు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రలోభాలకు లొంగకుండా సరైన నాయకులను ఎన్నుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని సూచించారు. ప్రస్తుత ప్రసార మాధ్యమాలు కేవలం వివాదాలకు ఇస్తున్న ప్రాధాన్యత సమాజానికి మేలు చేసే మంచి విషయాలకు ఇవ్వడం లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమాజంలో మంచిని ప్రోత్సహించే బాధ్యత పత్రికలదే అని హితవు పలికారు. విలువలతో కూడిన రాజకీయాలు మాత్రమే దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలవని ఆయన విశ్లేషించారు.

ప్రతి ఇంట్లో పిల్లలు తప్పనిసరిగా మాతృభాషలోనే మాట్లాడాలని స్పష్టం చేశారు. పరభాషా పదమైన అమ్మను సూచించే ఆంగ్ల పదం వాడితే వస్తుప్రదర్శనశాలలో పెట్టే శవం అని అర్థం వస్తుందని, అమ్మ, నాన్న అని పిలవడంలో ఉన్న కమ్మదనం ఆంగ్ల పదాల్లో ఏమాత్రం లేదని చురకలంటించారు. ఇతర భాషలు నేర్చుకోవద్దు అనడం లేదని, ప్రాధాన్యత మాత్రం కచ్చితంగా ముందు మాతృభాషకే ఇవ్వాలని సూచించారు. మాతృభాష కళ్లు లాంటిదని, పరభాష కళ్లద్దాలు లాంటిదని విశ్లేషించారు. హిందుత్వం అంటే ఒక ఇరుకైన మతం కాదని, ఎవరినీ ద్వేషించని ఒక గొప్ప జీవన విధానం, అత్యంత విశాలమైన సంస్కృతి అని ఆయన వివరించారు. భారతదేశం ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అత్యధిక వాటాను కలిగి ఉండి విశ్వగురువుగా వెలుగొందిందని, మన దేశం సుదీర్ఘ చరిత్రలో ఎప్పుడూ ఇతర దేశాలపై దండెత్తలేదని గుర్తు చేశారు. భారతీయ సనాతన ధర్మం సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని కోరుకుంటుందని ఉద్ఘాటిం చారు. తాత్కాలిక రుచుల కోసం పాశ్చాత్య ఆహారపు అలవాట్లకు బానిసలైతే భవిష్యత్తులో నిరంతరం దీర్ఘకాలిక రోగాల బారిన పడక తప్పదని యువతను హెచ్చరించారు. తక్షణమే తయారయ్యే ఆహారం తింటే నిరంతర రోగాలు వస్తాయని, సహజసిద్ధమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. నిత్యం యోగా, సూర్య నమస్కారాలు చేయడం ద్వారా శారీరక ధారుఢ్యాన్ని పెంచుకోవాలని కోరారు. ఆధునిక సాంకేతికత ఎంత పెరిగినా కృత్రిమ మేధస్సుకు మానవ మేధస్సు, భావోద్వేగాలు ఉండవని, దాని పరిమితులు తెలుసుకొని వాడుకోవాలని తెలిపారు. సమాచార సాంకేతికతను మానవళి అభివృద్ధి కోసం వాడుకోవాలి తప్ప వినాశనానికి కాదని స్పష్టం చేశారు. పిల్లలు దూరదర్శిని, చరవాణులు విపరీతంగా చూడటం వల్ల అనేక అనర్థాలు వస్తాయని, వాటి వాడకాన్ని కచ్చితంగా నియంత్రించాలని తల్లిదండ్రులకు సూచించారు. శారీరక శ్రమ లేకపోవడం వల్లే అనేక రుగ్మతలు దరిచేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తన జీవితం ఒక సాధారణ రైతు కుటుంబం నుండి ప్రారంభమైందని, చిన్న వయసులో ఆటలు ఆడటానికి రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శాఖకు వెళ్ళడం ద్వారా తనలో క్రమశిక్షణ, దేశభక్తి మొలకెత్తాయని ఆయన తన గతాన్ని నెమరువేసుకున్నారు. వాజ్‌పేయి, అద్వానీ లాంటి గొప్ప నాయకుల మార్గదర్శకత్వంలో పనిచేశానని తెలిపారు. సాధారణ రాజకీయ కార్యకర్త స్థాయి నుండి మంత్రిగా, జాతీయ అధ్యక్షుడిగా, అత్యున్నతమైన భారత ఉపరాష్ట్రపతి పదవిని అధిరోహించానంటే దానికి ప్రధాన కారణం కేవలం క్రమశిక్షణ, వ్యవస్థ అందించిన ప్రోత్సాహమే అని వినయంగా తెలియజేశారు. నిరంతరం నేర్చుకునే తపన ఉంటే ఎంతటి ఎత్తైనా ఎదగవచ్చని, యువత కూడా అదే బాటలో నడవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. పత్రికా విలేకరులు కూడా సమాజ హితం కోరే వార్తలు రాయాలని కోరారు. ఇటువంటి అద్భుతమైన కార్యక్రమాన్ని ఖమ్మం పట్టణంలో ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నారపు రాజు రామచంద్రరావు మాట్లాడుతూ నేటి రాజకీయ వాతావరణంపై ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయిని అన్ని రాజకీయ పక్షాల నాయకులు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. వాజ్‌పేయి మాటలు, ప్రసంగాల స్ఫూర్తితో ఎంతో మంది యువత రాజకీయాల్లోకి, సాహిత్యంలోకి వచ్చారని తెలిపారు. నాడు దూరదర్శన్‌లో వాజ్‌పేయి ప్రసంగాలను ప్రజలు ఎంతో ఆసక్తిగా చూసేవారని గుర్తుచేశారు. ఒక ప్రతిపక్ష నాయకుడిగా, చట్టసభల సభ్యుడిగా, ప్రధానమంత్రిగా ఎలా ఉండాలో వాజ్‌పేయి దేశానికి చూపించారని రామచంద్రరావు కొనియాడారు. తాను శాసనమండలి సభ్యుడిగా ఎన్నికైనప్పుడు సభలో అసభ్య పదజాలం వాడకూడదని, సభా వేదిక వద్దకు వెళ్లకూడదని వెంకయ్య నాయుడు, వి. రామారావు తనకు సూచించారని తెలిపారు. నేటి రాజకీయాల్లో ఆరోగ్యకరమైన విమర్శలకు బదులు బూతులు మాట్లాడుతున్నారని విమర్శించారు. శాసనసభలలో వస్తువులు పగులగొట్టడం, బట్టలు చించుకోవడం లాంటివి చేస్తున్నారని, తెలంగాణలో ఈ బూతుల సంస్కృతి పోవాలని హితవు పలికారు. వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు కాశ్మీర్ సమస్యపై మాట్లాడేం దుకు ఆయనను ఐక్యరాజ్యసమితికి పంపడం మన దేశ ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనం అని ప్రశంసించారు. వాజ్‌పేయి ఒక గొప్ప కవి అని, ఆయన రాసిన గీతాలను ప్రముఖ గాయకుడు జగ్జీత్ సింగ్ పాడారని గుర్తుచేశారు. కవితా సంకలనాన్ని తీసుకువచ్చిన ఖమ్మం వాసి వెంకటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు. వాజ్పేయి శతజయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షులు దుద్దుకూరి వెంకటేశ్వరరావు, మందడపు ప్రభాకర్ రెడ్డి,లతోపాటు కార్యక్రమంలో సామాజిక సమరసత జాతీయ కళా విభాగం కన్వీనర్,రిటైర్డ్ ప్రొఫెసర్ అప్పల ప్రసాద్ జి, ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ మంత్రి , కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ , భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి భాస్కరరావు జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు నాయకులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన పరమేశ్వరి నరేందర్

**శంషాబాద్. మార్చ్ 1. మరో ఉదయం దినపత్రిక .**

రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన పుట్టినరోజు సందర్భంగా శంషాబాద్ సర్కిల్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు, త్రినేత్ర ఫౌండేషన్ చైర్మన్ మడపతి పరమేశ్వరి నరేందర్ ఆయన నివాస గృహంలో కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న కార్తీక్ రెడ్డిని రాబోయే ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా చూడాలనేదే తమ ధ్యేయమని తెలిపారు. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న ఆయన ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ రాజకీయంగా అంచలంచలుగా ఎదగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఆశీస్సులతో ప్రజాప్రతినిధిగా ఎదిగి ప్రజలకు సేవలు అందించే అవకాశం కల్పించాలని భగవంతుని వేడుకుంటున్నట్లు పరమేశ్వరి నరేందర్ తెలిపారు.

## కార్తీక్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన శంషాబాద్ బిఆర్ఎస్ నాయకులు

**శంషాబాద్. మార్చ్ 1. మరో ఉదయం దినపత్రిక .**

రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తిక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శంషాబాద్ నాయకులు ఆయనను కలిసి పుట్టినరోజు శు భాకాంక్షలు తెలిపారు . ఆదివారం ఉదయం కార్తీక్ రెడ్డి నివాస గృహానికి వెళ్లి శాలువా పూలమాలలతో ఆయనను ఘనంగా సన్మానించారు. భారీ గజమాలను క్రేన్ సహాయంతో ఆయన మెడలో వేసి సంబరాలు చేసుకున్నారు. కార్తీక్ రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆ పార్టీ నాయకులు కోనమల్ల శ్రీనివాస్. దేవరంపల్లి బుచ్చిరెడ్డి. మంచెర్ల శ్రీనివాస్. కొలను ప్రదీప్ రెడ్డి. దీపా మల్లేష్ .చిన్నగండు రాజేందర్. సత్యేంద్రి వెంకట్ రెడ్డి.గుంటి చేరణ్. తదితరులు ఉన్నారు.

## మూడు రంగుల జెండానే జీవితం

## రామనాథం సేవలకు గుర్తింపు ఎప్పుడు..?

**మరో ఉదయం దినపత్రిక మార్చి 01, పినపాక ప్రతినిధి.**

పినపాక మండల అధ్యక్షుడు గోడిశాల రామనాథం, దశాబ్దాలుగా గా కాంగ్రెస్ పార్టీ ఊపిరిగా భావించి, మూడు రంగుల జెండాను నమ్ముకుని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా పార్టీ కోసం కష్టకాలంలో కూడా ముందుండి నడిపించిన పినపాక మండల అధ్యక్షుడు, గొడిశాల రామనాథం, మార్చి ఒకటి 2026న తన జన్మదినాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరుపుకున్నారు. పార్టీ పట్ల, పార్టీ శ్రేణుల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధత, క్రమశిక్షణ సేవా తపన స్థానిక నాయకులు, కార్యకర్తల ప్రశంసలను అందుకుంటుంది. రాజకీయంగా ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా పార్టీని విడిచి పెట్టకుండా సాధారణ కార్యకర్తగా మొదలై మండల అధ్యక్షుడు స్థాయికి ఎదగడం ఆయన పట్టుదలకు నిదర్శనమని కార్యకర్తలు అంటున్నారు. రామనాథం జన్మదినాన్ని పురస్కరించుకొని పినపాకలో కార్యకర్తలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ పట్ల ఆయనకు ఉన్న అంకితభావం యువతకు ఆదర్శమని పలువురు అభిప్రాయపడ్డారు పార్టీని నమ్ముకున్న రామనాదం ని పార్టీ ప్రభుత్వం గుర్తిస్తుందని పార్టీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు...

## ఖైరతాబాద్ ఫ్లేవర్స్ బిర్యాణి



## సెంటర్ ను సందర్శించిన ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**మరో ఉదయం దినపత్రిక యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో మార్చి 01**

యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకు వెళ్లాలని జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ సూచించారు. ఆదివారం ఖైరతాబాద్ మహాగణపతి సమీపంలోని ఏర్పాటుచేసిన ఫ్లేవర్ బిర్యాణి సెంటర్ ను ఆయన సందర్శంచారు.ఈ సందర్భంగా శివలాల్ యాదవ్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మంగళారపు మహేష్ యాదవ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,ని మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి సన్మానించారు.ఫ్లేవర్స్ బిర్యాణి సెంటర్లో బిర్యాణి తో పాలు రకరకాల వంటకాలు రుచికరంగా ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమములో అశోక్ యాదవ్,నందకిషోర్ యాదవ్,దయాకర్ యాదవ్, గిరి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆందోళనల ఫలితమే మణుగూరు - బయ్యారం వరకు రోడ్డుమరమ్మతులు

- సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి

**మరో ఉదయం దినపత్రిక మార్చి 01, పినపాక ప్రతినిధి.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక నియోజకవర్గం మణుగూరు నుండి బయ్యారం క్రాస్ రోడ్డు వరకు రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని, దుమ్ము నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ.... సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపందా) ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలను కలుపుకొని నిర్వహించిన ఆందోళనలు,మరియు అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు ఇచ్చి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరటం ఫలితంగానే రోడ్డు మరమ్మతులు ప్రారంభమయ్యాయని.. సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి తెలిపారు. రోడ్డు మరమ్మత్తులు ప్రారంభం కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ రోడ్డు మరమ్మత్తుల వలన దుమ్ము, ధూళి నుండి ప్రజలకు కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక శాసనసభ్యులు పాయం. వెంకటేశ్వర్లు కలిసి విన్నవించగా వెంటనే స్పందించి ఈ రోడ్డు మరమ్మతులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించి, మరమ్మతులు మొదలు పెట్టించినందుకు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు..

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com